**కథ**

# గినీపిగ్స్

**ఎస్.శ్రీదేవి**

**"మనిషి మెదడు అనే ప్రయోగశాలలో ఏ కొత్త ఆలోచన వచ్చినా దానికి ముందు బలయ్యేది అతని పిల్లలే" శివరావు కొడుకు ఇంట్లోంచీ పారిపోయాడని తెలిసినప్పుడు అన్నాడు మాధవ్ చంద్రమోహన్‌తో. అతనలా అనటానికి దాదాపు నెల క్రితం వాళ్లిద్దరి స్నేహం పునరుద్ధరింపబడింది.**

**శివరావు, చంద్రమోహన్‌కీ అలాంటి ఇంకా చాలామందికి ఆధ్యాత్మిక గురువు.**

ఆఫీసు నుంచీ ఇంటికొస్తున్నాడు చంద్రమోహన్. ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంది. హారన్ కొడుతూ ఒకరినొకరు ఓవర్‌టేక్ చేస్తూ. అతనికి చాలా చికాకు తెప్పించే దృశ్యమది. జనానికి బొత్తిగా సివిక్‌సెన్సు లేకుండాపోతోంది అనుకుంటూ స్కూటరు ఇంటివైపు టర్న్ చెయ్యబోతుంటే ఎవరో వెనక నుంచీ ఓవర్‌టేక్ చేసి అతని ముందు ఆగారు. సడెన్‌బ్రేకు వేసుకుని ఆగక తప్పలేదతనికి.

తీరా చూస్తే మాధవ్. ఒకప్పుడతని క్లాస్‌మేటు. ఇద్దరూ కలిసి గది తీసుకుని ఉండి కొన్నాళ్లు చదువుకున్నారు. తర్వాత ఒకరి పద్ధతులొకరికి నచ్చక విడిపోయారు.

చాలా రిజిడ్‌గా ఉంటాడు చంద్రమోహన్. ప్రతీదీ పద్ధతిగా ఉండాలతనికి. లేకపోతే ఊరుకోడు. బాగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిన తెల్ల షర్టులే వేసుకుంటాడు. వాటి మీద చిన్న మరక కూడా పడకుండా జాగ్రత్తపడతాడు. ఆఫీసు నుంచీ ఇంటికొస్తున్నాడంటే ఇంట్లో అందరికీ హడలే. ఇంట్లో ఉన్నంతసేపూ సరేసరి.

వాళ్లింట్లో న్యూస్‌పేపరు అతనొక్కడే చదువుతాడు. ఇంకెవరూ దాన్ని ముట్టుకోరు. ముట్టుకుంటే దాన్ని మడతలో మడతేసి పెట్టాలి.

"పదిహేను వేలు పెట్టి ఫారిన్ గ్రాస్ వేయించాను, ట్రిమ్ చెయ్యాలని ఒక్కళ్లకీ అనిపించలేదా? అదెంత పని? పిల్లలు స్కూలు నుంచీ వచ్చి ఏం చేస్తారు?" అంటాడు.

"అందరిళ్లల్లోనూ డేడీ అంటే ఎంతో ఫ్రెండ్లీగా ఉంటారు, మనింట్లో ఏంటమ్మా?" అంటారు పిల్లలు. నిట్టూర్పే స్వప్న జవాబు.

పిల్లలు కొంచెం అల్లరి చేసినా సహించడు. ఎంతసేపూ చదువుకోవాలి. లేకపోతే కేరమ్స్, చెస్ లాంటివి ఆటలాడుకోవాలి. ఎంతసేపని చదువుకుంటారు? హోంవర్కు చేసేశాక బోల్డు తీరిక. ఆడుకుంటారు, దెబ్బలాడుకుంటారు, మళ్లీ కలుసుకుంటారు. వాళ్ల గొడవేదో వాళ్లు పడతారని వదిలిపెట్టడు. వాళ్లు స్పాయిలౌతారని భయం.

ఒక్కో మనిషికి ఒక్కొక్కటి ప్రధానమనిపిస్తుంది. ఇల్లు నీట్‌గా ఉండటం అవసరమే గానీ అదొక్కటే పని కాదు తనకి. కాసేపు పిల్లల్తో అన్ని బాధ్యతలూ మర్చిపోయి కబుర్లు చెప్పాలనిపిస్తుంది. పెళ్లికి ముందు సంగీతం నేర్చుకుంది తను. వాళ్లకి నేర్పించాలనిపిస్తుంది. పొద్దున్నే లేచి ప్రాక్టీసు చెయ్యాలని అతని శాసనం. పొద్దున్నే పాటలు పాడుతూ కూర్చుంటే పనులెలా ఔతాయి? ఇంకా ముందు లెమ్మంటాడు. ఎంత ముందు లేవగలదు?

అతనిక్కూడా విసుగ్గానే ఉంటుంది. ప్రతీదీ తను వెంటపడి చేయించటమే తప్ప, భార్య గానీ పిల్లలు గానీ వాళ్లేం చెయ్యాలని తను ఆశిస్తాడో అది వాళ్లంతట వాళ్లే చెయ్యకపోవటం బాధిస్తుంటుంది.

చదువుకునే రోజుల్లో ఇంకా రిజిడ్‌గా ఉండేవాడు. తన పుస్తకాలూ, వస్తువులూ మరొకరు ముట్టుకోవటం నచ్చేది కాదు. మాధవ్ పూర్తిగా ఫ్రీ టైపు. ఇద్దరికీ కెమిస్ట్రీ బుక్ విషయంలో గొడవొచ్చింది. చాలా చిన్న గొడవ. మాధవ్‌కి కెమిస్ట్రీ బుక్ దొరకలేదు. తప్పనిసరై చంద్రమోహన్‌ది వాడుకునే వాడు. ఒకసారి అది చేతిలోంచీ జారిపడి అట్ట ఊడిపోయింది. చంద్రమోహన్ గురించి తెలుసు కాబట్టి వెంటనే సారీ చెప్పి వెళ్లి బైండింగ్ చేయించుకొచ్చాడు. ఐనా అతను గొణిగేసరికి ఇంక సహించలేక గది ఖాళీ చేసి వెళ్లిపోయాడు. వెళ్లే ముందు అతనన్న మాటలు...

"ఆఫ్టాల్, కొన్ని ఉమ్మడి అవసరాల కోసం కలిసుంటున్నాం. చదువుకోవటానికి వీలుగా ఉంటుందనీ, ఖర్చులు కలిసొస్తాయనీ, ఒక ఊరివాళ్లమనీ...ఇలా ఎన్నో ఆలోచించి మనిద్దర్నీ ఒకచోట ఉంచారు మన పేరెంట్స్. నువ్వేమో ఏ విషయంలోనూ సర్దుకోలేకపోతున్నావు. రేపు పెళ్లయ్యాక ఎలా కలిసుంటావురా, జీవితాంతం ఒకటిగా బతకాల్సిన అమ్మాయితో?"

ఆ మాటలు గుర్తొచ్చాయి చంద్రమోహన్‌కి. ఆ మాధవ్ ఇలా కనిపించేసరికి స్టన్నయ్యాడు. చదువుకునే రోజుల్లో చాలా అస్తవ్యస్తంగా ఉండేవాడు మాధవ్. వస్తువులు సర్దుకోవడంలో గానీ బట్టల విషయంలోగానీ ఇంకెందులోగానీ ఎలాంటి పట్టింపు ఉండేది కాదు. ప్రతీదీ నవ్వుతూ తీసిపారేసేవాడు. ఇప్పుడూ అదే నవ్వు. ఆ నవ్వులో అదే ఉల్లాసం. ఇంకా పెరిగింది కానీ తగ్గలేదు. అప్పుడు సన్నగా రివటలా ఉండేవాడు. ఇప్పుడు కాస్త వళ్లొచ్చి స్మార్ట్‌గా కనిపిస్తున్నాడు. అంతే తేడా.

"అప్పటికీ ఇప్పటికీ నువ్వేం మారలేదు" ఆరోపించాడు చంద్రమోహన్.

మాధవ్ నవ్వేశాడు. "ఇక్కడేనా, ఉండేది? శాంతికి ఇక్కడికి ట్రాన్స్‌ఫరైంది. ముందుగా పిల్లల్ని తీసుకుని ఇక్కడికొచ్చేసింది. ఇప్పుడు నేనూ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నాను. పద మా ఇంటికెళ్దాం దగ్గరే" అన్నాడు.

చంద్రమోహన్ ఇబ్బందిగా చూశాడు. "మరోసారి వస్తాను. ఎడ్రెసివ్వు" అన్నాడు.

"అర్జెంటు పనేం లేదుగా?" అడిగాడు మాధవ్ బలవంతపెడ్తూ.

ద్వైదీభావంతో ఊగిసలాడాడు చంద్రమోహన్. అతన్ని తప్పించుకుని పారిపోవాలనీ అనిపించింది, అతనన్న మాటలకి, అతనింటికి వెళ్లి అతని జీవితాన్నీ శోధించాలనీ ఉంది. అలాంటి మాటలన్న వ్యక్తి ఇప్పుడెలా ఉన్నాడోనని. రెండో కోరిక జయించింది. రెండు స్కూటర్లూ మాధవ్ ఇంటిదారి పట్టాయి.


వీళ్లు వెళ్లేసరికి మాధవ్ భార్య శాంతి పిల్లల్తో షటిల్ ఆడుతోంది. విశాలమైన ఆవరణలో నాలుగ్గదుల ఇల్లు. కొద్దిగా స్థలం వదిలి కాంపౌండంతా గచ్చు చేయించారు. రంగురంగుల పువ్వుల మొక్కలున్నాయి ఆ కొద్ది స్థలంలో. పెద్ద ఉయ్యాలా, కూర్చోవటానికి ఎల్ ఆకారంలో రెండు సిమెంటు బెంచీలు ఉన్నాయి. వాటి మధ్యగా చిన్నది సిమెంటు టీపాయ్ ఉంది. బోర్‌వెల్, దాని పక్కని పెర్కొలేషన్ పిట్ ఉన్నాయి. ఈమధ్యే కట్టుకున్నామని చెప్పాడు మాధవ్ దారిలో.

శాంతీ, పిల్లలూ ఆటాపి వచ్చారు. పిల్లలు చంద్రమోహన్‌కి హలో చెప్పేసి, మళ్లీ ఆడుకుందుకు వెళ్లిపోయారు.

శాంతి వీళ్లకి రెండేళ్లు జూనియరు. వీళ్ల కాలేజీలోనే చదివింది. పెద్దవాళ్లు ఆమెని చంద్రమోహన్‌కి ప్రతిపాదిస్తే అతన్ని కాదని మాధవ్‌ని ఇష్టపడి చేసుకుంది. అతని గురించి పెళ్లికి ముందే కొద్దిగా తెలుసు. తర్వాత మాధవ్ ద్వారా తెలుసుకుంది. ఇప్పుడిలా కలుసుకోవటం ఇద్దర్లోనూ కొద్దిగా ఇబ్బందిని రేపినా, వెంటనే సర్దుకున్నారు.

మిత్రులిద్దరూ కబుర్లలో పడ్డారు. శివరావు ప్రస్తావన కూడా వచ్చింది. అతడు మాధవ్‌కి కూడా తెలుసు. దూరపు బంధుత్వం. చంద్రమోహన్ అత

నితో కాంటాక్టులో ఉన్నాడని తెలిసి, "ఇంకా అలాగే ఉన్నాడా? ఏమైనా మారాడా?" అనడిగాడు. చంద్రమోహన్ నవ్వి మాట దాటేశాడు. మాధవ్‌కి చాలా విషయాలు నచ్చవు. అతనికి నచ్చనివి తనకి నచ్చుతాయి. శివరావు అందులో ఒకటి.



శాంతి మూడు గ్లాసుల్లో షర్బత్ తీసుకొచ్చింది. వాళ్లిద్దరికీ ఇచ్చి, తనూ తాగుతూ అక్కడే కూర్చుంది. టీచరట. మాధవ్ కన్నా మాటలపోగు. ఏవో చెప్తూనే ఉంది, ఇంకేవో అడుగుతూనే ఉంది. తమతో కూర్చుని ఇలా కబుర్లు చెప్తుంటే వంటెప్పుడు చేస్తుంది, పిల్లలచేత హోమ్ వర్కెప్పుడు చేయిస్తుందనిపించింది చంద్రమోహన్‌కి. ఇంతలో ట్యూషన్ మాస్టరొచ్చాడు. పిల్లలు ఎవరూ చెప్పకుండానే ఆటలు కట్టిపెట్టి పుస్తకాలు తెచ్చుకున్నారు. కాంపౌండులోనే వేరే చోటికి వెళ్లిపోయారు.

"మీరూ టీచరే కదా, మళ్లీ ట్యూషనెందుకు?" అడక్కుండా ఉండలేకపోయాడు చంద్రమోహన్.

"టీచర్నే. స్కూలో. ఇంట్లో మాత్రం కాదు" నవ్వింది శాంతి. "ఆరున్నర గంటల సేపు స్కూల్లో చెప్పి మళ్లీ ఇక్కడ వీళ్లకేం చెప్పగలను? అక్కడ చెప్పేది సైన్సు. వీళ్ల కోసమంటే మళ్లీ ప్రిపేరవ్వాలి" అంది.

"కానీ తల్లి చెప్తే పిల్లలు బాగా గ్రహిస్తారంటారు. నా పిల్లలకి మా స్వప్నే చెప్తుంది"

"ఇంట్లో ఉండే మదర్స్ చెప్పచ్చునుకోండి" సందిగ్ధంగా ఆగింది.

"తనూ ఉద్యోగస్తురాలే. సెంట్రల్ ఎక్సైజ్‌లో చేస్తుంది" అన్నాడు చంద్రమోహన్ ఆమె సందిగ్ధాన్ని గమనించి.

"రోజుకి ఏడెనిమిది గంటలు బైట గడుపుతాను. ఇంకో ఐదారు గంటలు ఇంటి పని. ఆ పైన నిద్ర. ఇంక తీరికెక్కడిది? పెయింటింగ్ నా హాబీ. రోజుకి ఒక్క గంటేనా పెయింట్ చెయ్యకపోతే ఉండలేను. ఐనా రిక్రియేషన్ లేకపోతే ఎలా?"

"వర్కిజ్ వర్షిప్ అన్నారండీ! పనిలోనే ఆనందం దొరుకుతుందన్నారు" తనకి తెలీకుండానే వాదనలోకి దిగాడు. "అబ్రహం లింకనంతటి వాడు తన బూట్లు తను పాలిష్ చేసుకుని అందులో ఆనందం పొందేవాడట. డిగ్నిటీ ఆఫ్ లేబర్" అని కూడా అన్నాడు.

శాంతికీ మాధవ్‌కీ చాలా పెద్ద ఫ్రెండ్స్ సర్కిలుంది. ఇలాంటి వాదోపవాదాలు వాళ్లకి అలవాటే. అందుకే శాంతీ తగ్గలేదు. నిర్ద్వంద్వంగా ఖండించింది. "డిగ్నిటీ ఆఫ్ లేబరంటే ఒక దేశానికి ప్రెసిడెంటు బూట్లు పాలిష్ చేసుకోవటం కాదు. ఆయన టైం అంత విలువలేనిది కాదు. ప్రజలు ఆయన్ని ఏదో చేస్తాడని ఎన్నుకుని ఉంటారు. చెప్పులెవరేనా పాలిష్ చేస్తారు. కానీ ఆయన విధుల్ని ఇంకెవరూ చెయ్యలేరు. ఇంక ఆ పనిలో ఆనందం పొందటమంటారా, అది పూర్తిగా వ్యక్తిగతం. ఎక్కడో చదివాను బ్రిటీష్ యువరాజుకి కమోడ్స్ సేకరించడం హాబీ అని" అంది.

"ఎవరి పని వాళ్లు.."

"ఎన్నని చేసుకోగలం? అనారోగ్యం వస్తే వైద్యం చేసుకోగలమా? మనిల్లు మనం కట్టుకోగలమా? మన తిండి మనం పండించుకోగలమా?"

"మన చేతిలో లేని వాటికి మనమేం చెయ్యలేం. కనీసం చిన్నచిన్న పనులేనా వేసుకోవచ్చుకదా?"

"జాకాఫ్ ఆల్ ట్రేడ్స్ అనిపించుకోవడం కన్నా కనీసం ఒక్క దాంట్లోనేనా పరిణతి పొందటం మన అవసరం. జీతం తీసుకుంటున్నందుకు ఉద్యోగ ధర్మం సక్రమంగా నిర్వర్తించడం, అంకితభావంతో పని చెయ్యటం ఎంత ముఖ్యమో అలా జీతం తీసుకునే అవకాశం లేని వారికి మనమే కొన్ని అవకాశాలిచ్చి, వాళ్లు మన కోసం చేసిన దాని విలువ గుర్తించి సరిగ్గా రేపే చేసి, వీలైతే కృతజ్ఞతని చూపించడం కూడా అంతే ముఖ్యం. మీరిందాకా అన్నారే, డిగ్నిటీ ఆఫ్ లేబరనీ అదే ఇది."

వృత్తిపరంగా, ప్రవృత్తిపరంగా విస్తృతమైన ప్రపంచాన్ని చదివిందామె. స్కూల్లో పిల్లలు, వాళ్ల తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు.. ఇలా ఎందర్నో

చూసింది. ఎన్నో పరిచయాలు.. ఇంకెన్నో పరిశీలనలు.. రకరకాల మనస్తత్వాలు.. వాటిల్లో ఎంతో విలక్షణత. మనుషులంతా ఒకే సామాజిక నీతికి కట్టుబడి ఉంటే ఆ సాంఘిక జీవనంలో ఎలాంటి సంఘర్షణా ఉండదు. అందరికీ రాముడో, కృష్ణుడో ఎవరో ఒకరే దేవుడిగా రోల్‌మోడల్‌గా ఉంటే అతడు చెప్పిన, ఆచరించిన సిద్ధాంతాలని పాటించడంలో ఎవరికీ ఎలాంటి ఆక్షేపణా ఉండదు. కానీ వాస్తవంలో అలా ఉండదు పరిస్థితి.

కష్టపడి పైకొచ్చినవాడు అదో క్రెడిట్‌లా ప్రకటించుకుంటాడు. అలాగే లంచం తీసుకోనివాళ్లు, డిసిప్లిన్ మనుషులు.. ఎవరికి వారు తమని తాము గొప్పగా ప్రకటించుకుంటారు. కానీ తాము ఆ విధంగా తయారవ్వాలనుకుని తయారవ్వలేదనీ పరిస్థితులు తయారుచేశాయనీ అనుకోరు. పిల్లలకి తమే రోల్ మోడల్స్ కావాలనుకుంటారు తానే కష్టపడి అన్నీ సమకూర్చాకా ఇంకా అలాగే కష్టపడే అవసరం కొడుక్కి ఎందుకుంటుంది? తను నిర్మించిన డిసిప్లిన్ చట్రంలో భార్యాపిల్లలు నలిగిపోతున్నారేమో! చుట్టూ ఉన్నవాళ్లందరూ లంచం తీసుకుని తానొక్కడే లంచం తీసుకోకుండా ఉంటూ ఉనికిని నిలుపుకోవటం కోసం చేసే ప్రయత్నంలో ఇంకెన్ని మానవీయ విలువలు ధ్వంసమవుతున్నాయెూ! ఇవన్నీ ఎవరి ఊహకీ అందనివి. ఎవరూ ఊహించడానికి కూడా ఇష్టపడనివి.

చంద్రమోహన్ దిగ్భ్రాంతిగా విన్నాడు శాంతి మాటలని. అతనికి కొన్ని విషయాలు తెలుసు. వాటి ఆధారంగా కొన్ని కొన్ని సిద్ధాంతాలు ఏర్పరుచుకున్నాడు. అవి సరైనవని నమ్ముతూ వస్తున్నాడు. ఇప్పుడు వాటి మూలాలు కదిలాయి. శాంతిలో ఉన్న లైవ్లీనెస్, వాక్పటిమ అతన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. తనని చేసుకోవటానికి విముఖత చూపించి, మాధవ్‌ని కోరి చేసుకుని మాధవ్ నవ్వులకి తనూ ఒక అలంకారంగా ఉండటం అతన్ని విస్మయపరుస్తోంది. స్వప్న ఎప్పుడూ ఇలా ఉండదు. తన ప్రెజెన్స్‌ని ఎంజాయ్ చెయ్యదు. ఏదో అయిష్టత. స్వప్నే కాదు, తను చూసిన ఏ స్త్రీ కూడా ఇలా ఉండదు.

"మా శాంతి చాలా కేలుక్యులేటెడ్‌గా ఉంటుందిరా! పెద్ద ఇల్లూ, కారూ లాంటి కోరికలేం లేవు తనకి. అలాంటి వాటి గురించి కలలు కనే ముందు వాటి మెయింటినెన్సు గురించి ఆలోచించమంటుంది" మాధవ్ కలుగజేసుకున్నాడు.

"మెయింటినెన్సుదేముంది? ఈ రోజుల్లో రెండు మూడు బెడ్‌రూమ్సుతోనో డూప్లెక్స్‌తోటో ఇల్లూ, కారూ కామనైపోయాయి. ఇద్దరూ సంపాదిస్తున్నప్పుడు ఆపాటి ఎఫర్డ్ చెయ్యకపోతే ఎలా? బేంకు లోను తీసుకుని కట్టాను ఇరవై లక్షలైంది మా ఇల్లు. సినిమా సెట్టింగులా ఉంటుంది" అన్నాడు చంద్రమోహన్.

శాంతి నెమ్మదిగా అక్కడి నుంచీ లోపలికి వెళ్లిపోయింది. వాళ్ల మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

"ఎఫర్డ్ చెయ్యడమంటే డబ్బు విషయంలో అని కాదు. డబ్బుంది కదాని పెద్దిల్లు కడతాము. కారు కొనుక్కుంటాము. వాటి మెయింటెనెన్స్? నెలకి వెయ్యో రెండువేలో ఇచ్చి మనిషిని పెట్టుకోగలమో లేదో చూడాలంటుంది తను"

"మరి ఆడవాళ్లున్నది దేనికట?" వ్యంగ్యంగా అడిగాడు చంద్రమోహన్.

"వాళ్లకే అక్కర్లేకపోతే?"

"అక్కర్లేదననేసుకుంటే సరిపోతుందా?"

"వాళ్ల టైముని మన లెక్కలో వేసేసుకుంటే ఎలా?"

"నువ్వేం చేస్తావు?"

"శాంతి నాకు వండిపెడితే థాంక్స్ చెప్తూ తింటాను" నవ్వుతూ చెప్పాడు మాధవ్.

"థేంక్స్ దేనికి?" తనూ నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అడిగాడు చంద్రమోహన్.

"ఎందుకేమిటి? నాతో సమానంగా సంపాదిస్తూ కూడా నాకు వండిపెడుతున్నందుకు"

"నువ్వేం మారలేదు" అన్నాడు చంద్రమోహన్.

తర్వాత చాలాసేపటి దాకా మాట్లాడలేదు. తనలో తను ఆలోచించుకుంటూ ఉండిపోయాడు. చాలా పెద్ద ఇల్లు కట్టాడు తను. ఇంటిముందు గార్డెన్, ఇంట్లో కుక్క, ఖరీదైన ఫర్నిచర్.. ఇవ్వన్నీ స్వప్నకి అవసరమని చూడకుండా, డబ్బుంది కదాని, తనకి నచ్చాయని అమర్చాడు. అవి పద్ధతిగా ఉన్నాయా లేదాని మాత్రం చూస్తూ వచ్చాడు. ఈ భావపరిమళాలు తనకి కొత్త. స్వప్న శాంతిలా ఇలా బోల్డ్‌గా బోల్డ్‌గా తన అభిప్రాయాలు చెప్పగలదా? అసలామెకి ఇష్టానిష్టాలున్నాయా?

మాధవ్ అతన్ని చూసి నవ్వాడు మళ్లీ. "నాలో ఏ మార్పూ రానట్టే నీలోనూ రాలేదు" అన్నాడు. "కానీ చాలా హేపీగా ఉన్నాను. నవ్వులనావలా సాగిపోతోంది జీవితం. ఏవేనా లోపాలు ఉండచ్చు కానీ వాటి బరువు మా మనసుల్ని కృంగదీయదు."

చంద్రమోహన్ నిస్తేజంగా చూశాడు. "స్వప్ననీ పిల్లల్నీ నేనెంతో ప్రేమిస్తాను. ఐనా మా ఇల్లు నీ ఇంటిలా ఉండదు. నా భార్య తన ఇష్టానిష్టాలని ఎప్పుడూ బైటికనదు. నా పిల్లలు నన్ను చూసి పక్కకి పక్కకి తప్పుకుంటారు" అన్నాడు.

"నీ అభిప్రాయాల మీద నువ్వు రిజిడ్‌గా కూర్చున్నప్పుడు అవతలి వాళ్లకింక తమ

## అదన్నమాట సంగతి!

*'ధూమ్-2'లో హృతిక్-ఐశ్వర్యల కిస్సింగ్ సీన్‌ని నిర్మాత ఆదిత్య చోప్రా కావాలనే ఇరికించాడని సినీజనాలు తెగ చెప్పుకుంటున్నారు. ఎందుకంటారా? గతంలో రాణీముఖర్జీని అభిషేక్ బచ్చన్ కొన్ని సినిమాల్లో ముద్దు పెట్టుకున్నాడు కాబట్టి, అభిషేక్ కాబోయే భార్య ఐశ్వర్య గనక ఇలాంటి సీన్ పెట్టితీరాలని ఆదిత్య పట్టుపట్టి వుంటాడని సినీ ప్రముఖులు చాలామంది చెవులు కొరుక్కుంటున్నారు. మరి రాణీముఖర్జీ-ఆదిత్యల ఎఫైర్ గురించి బాలీవుడ్ అంతా గోలగోల అవుతున్న సంగతి విదితమే!*



సొంత అభిప్రాయాలని చెప్పే అవకాశం ఎక్కడిది? మనం మడత నలగని షర్టు వేసుకున్నామా లేదా అనేది కాదు, ముఖ్యం. వంటి మీద వేసుకుని తెల్లారి లేచి ఉతుక్కుని వేసేదాని కోసం ఇంత కష్టపడడం అవసరమా అనేది ముఖ్యం. మూణ్ణాళ్ల బ్రతుకు కోసం కొత్త సిద్ధాంతాలని అన్వేషిస్తూ, ప్రతిక్షణం మెదడుకి పదును పెడుతూ బతకడం కన్నా, ఉన్న సిద్ధాంతాల తోనే అందర్లాగే సర్దుకుంటూ బతికేస్తే పోలే? నీ తెల్ల షర్టు చూసినప్పుడే అనుకున్నాను, నువ్వింకా మారలేదని. చిన్నప్పటి చనువుతో చెప్తున్నాను, ఇప్పటికేనా మారే ప్రయత్నం చెయ్యి. లేకపోతే ఎన్నో కోల్పోతావు" చెప్పాడు మాధవ్.

కొద్దిసేపు ఊరుకుని లేచాడు చంద్రమోహన్. భోజనానికి ఉండమంది శాంతి. మరోసారి వస్తానని వీడ్కోలు తీసుకున్నాడు.

ఎలాంటి ఫ్లెగ్జిబులిటీ లేకుండా ఉన్న అతన్ని తలుచుకుంటే శాంతికి ఆశ్చర్యం వేసింది. మనుషులు నవ్వకుండా బిగదీసుకుని ఎలా ఉండగలరు? భార్య ఎలా నెగ్గుతోందో పురుషాహంకార భావజాలంతో స్త్రీ ఎంత నష్టపోతోందో, ఎంత స్వేచ్ఛని కోల్పోతోందో తెలుసు. సిద్ధాంతాలని మగవాళ్లు తయారుచేస్తారు, నెగ్గించుకుంటారు. ప్రతిఘటించి లొంగిపోవటం, ప్రతిఘటించకుండా లొంగిపోవటం అనే రెండే స్త్రీకి గల ప్రత్యామ్నాయాలు.

చాలా చిన్న సూత్రం. ఒకర్ని ఒక పని చెయ్యమన్నప్పుడు వాళ్లెలా చేస్తారో అలా చేయించుకోవటం, ఒకరి పని మనమే ముందు పడి చెయ్యాలనుకున్నప్పుడు వాళ్లకి నచ్చేలా చెయ్యటం...

ఇంటి పని ఆడవారికి అప్పగించారు. ఆమెకి నచ్చినట్టు చేసుకునే స్వేచ్ఛనివ్వాలి. అందులో ఆమెకి ఆనందం కలిగే స్ఫూర్తి ఉండాలి. ఈ చిన్న సూత్రాన్ని దాదాపు మగవాళ్లంతా విస్మరిస్తున్నారు. నువ్విలా చెయ్...అలా చెయ్...ఇది చెయ్...అది చెయ్...నాకు నచ్చినట్టు చెయ్.. నాకు లాభం కలిగేలా చెయ్.. అన్నీ ఆదేశాలే. ఏ చిన్న పొరపాటు జరిగినా ఆమెని దోషిని చేస్తారు. మగవాళ్లకే సరదా ఉన్నా దాన్ని నిర్మొహమాటంగా భార్యల మీదికి నెట్టేస్తారు. తన కొలీగ్‌కి కుక్కంటే ఇష్టం. అతని భార్యకి ఇష్టం లేదు. అతను కొంటాననీ, ఆమె వద్దనీ.. ఆఖరికతను కొనుక్కొచ్చి ఇంట్లో వదిలాడు. ఆమెకి దాని చాకిరీ. దాన్ని శుభ్రంగా ఉంచి, తిండీ అదీ పెడుతుంటే అతను దాన్ని వాకింగ్‌కి తీసుకెళ్తాడు. నిత్యం ఇలాంటివెన్నో ప్రపంచం విస్తృతమై దైనందిన కార్యకలాపాలు పెరుగుతున్నకొద్దీ భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలూ పెరుగుతున్నాయి.

చంద్రమోహన్ని కాదని మాధవ్‌ని చేసుకోవటం జీవితంలో అన్నింటి కన్నా తను చేసిన తెలివైన పని అనిపించింది శాంతికి.

★ ★ ★

"ఎందుకింత ఆలస్యమైంది?" అడిగింది స్వప్న.

"మాధవ్ కనిపించి వాళ్లింటికి తీసుకెళ్లాడు" అన్నాడు.

మాధవ్ స్వప్నకి బాగా తెలుసు. ఇంట్లో ఏది పద్ధతిగా లేకపోయినా అతన్ని ఉదాహరణగా చెప్తాడు చంద్రమోహన్.

"ఎక్కడ కలిశాడు? ఏం చేస్తున్నాడు? ఈ ఊళ్లోనే ఉంటున్నారా, వాళ్లు? ఏం చేస్తున్నాడు? మనింటికే రమ్మనకపోయారా?" కుతూహలంగా ఇన్ని ప్రశ్నలడిగింది. అతను అన్యమనస్కంగా చెప్పి, ఫోన్ మోగుతుంటే లేచి వెళ్లాడు. అవతల పార్వతి. శివరావు భార్య. చాలా ఆందోళనగా ఉంది ఆమె స్వరం.

"రాజా ఇప్పటిదాకా ఇంటికి రాలేదు. మీ ఇంట్లో గానీ ఉన్నాడా?" అడిగింది. చంద్రమోహన్ టైము చూశాడు. పది దాటింది.


"ఇంకా రాకపోవటమేమిటి? సినిమాకేమైనా వెళ్లాడేమో!" అని అతనంటే, "లేదు, వాడి ఫ్రెండ్సందరూ ఇళ్లల్లోనే ఉన్నారు. ఒక్కడూ వెళ్లేంత తెలివి లేదు" అంది. అంటూ చెప్పుకొచ్చింది. ముందురోజు రాత్రి శివరావ్ ఇంట్లో బాగా గొడవైందట. రాజా వాళ్ల ఏకైక సంతానం. వాడు పొద్దున్నే లేవడనీ, రాత్రి పొద్దుపోయే దాకా మేలుకుంటాడనీ, గంటలు గంటలు క్రికెట్టాడతాడుగానీ, యోగాసనాలు వేసి సూర్యనమస్కారాలు చెయ్యడనీ, తిండి దగ్గర గొడవ చేస్తాడనీ, ఇంట్లో తెలీకుండా బైటి తిళ్లు తింటాడనీ చాలా కంప్లైంట్స్ ఉన్నాయి శివరావుకి వాడిమీద. కొడుతుంటాడు కూడా. వాడిప్పుడు పదోతరగతి పరీక్షలు రాశాడు.

సమ్మర్ క్లాసుల్లోనూ తర్వాత ఇంటర్లో రెసిడెన్షియల్లోనూ పడేస్తే వాళ్లే వాడిని దార్లో పెడతారని అన్నాడట. వాడిదింకా పసితనమేననీ, బాల్య చాపల్యాలుంటాయనీ అనుకోడు. వాడు బాగా స్పాయిలయ్యాడని అతని నమ్మకం.

"ఇంక దాపరికమేమీ లేదు. మీ మిత్రుడితో చాలా విసిగిపోయాను. తనకెంత తోస్తే అంత తప్పించి మరొకరి మాట వినరు. ఒక్క పిల్లాడు. వాడికి నచ్చిన తిండి తిననివ్వరు. కంటి నిండా నిద్రపోనివ్వరు. మూడింటికీ నాలుగింటికీ లేపేస్తారు. చన్నీళ్ల స్నానం చేయిస్తారు. తనకేవైనా నమ్మకాలూ, ఆశయాలూ ఉంటే తన వరకూ ఉంచుకోవాలి. యోగా స్కూలేదో మొదలుపెట్టారు. అందులోకి ఇష్టపడి వచ్చేవాళ్లకి చెప్పుకోవాలి. అంతేగానీ వీడినలా పీడిస్తే ఎంతకని సహిస్తాడు? ఇంతకాలం వాడు చిన్నపిల్లాడు. ఎదురుతిరగడం రాదనుకున్నాను. కానీ వాడెంతో ఎదిగిపోయాడు. పెద్ద ప్రయత్నమే చేశాడు, తండ్రి బారి నుంచి బైటపడటానికి. ఇప్పుడేనా ఏమంటారు, కడుపు మాడితే వాడి తిరిగొస్తాడనేసి తన దార్ని తను యోగా కేంపుకి వేరే ఊరు వెళ్లిపోయాడు. ఏం

## బాలీవుడ్ 'బాయ్'

'రంగ్‌దే బసంతీ' సినిమా తర్వాత 'సిద్ధార్థ సూర్యనారాయణ్' ('సిద్ధార్థ' పూర్తి పేరులెండి) నిరీక్షణ ఫలించిందిప్పటికి. సిద్ధార్థ రెండో హిందీ సినిమా ఇప్పుడు మొదలవుతోంది. కమర్షియల్ డైరెక్టర్‌గా మంచి పేరున్న డేవిడ్ ధవన్ దర్శకత్వంలో 'యుటివి' వాళ్లు నిర్మించే సినిమాలో సిద్ధార్థ హీరోగా నటిస్తున్నాడు. అమృతా రావు హీరోయిన్‌గా నటించే ఈ సినిమాలో మరో ముఖ్యపాత్రని నానాపటేకర్ ధరిస్తున్నాడు. ఈ సినిమాతో సిద్ధార్థ హిందీ కెరీర్‌కి కొత్త రూపు రావచ్చు.



చెయ్యను? ఎక్కడని వెతకను?'' నిస్సహాయంగా ఏడుస్తోంది.

"నువ్వేం కంగారు పడకు. నేను వాడిని వెతికి స్తాను'' అన్నాడు చంద్రమోహన్.

"ఏం జరిగింది?'' అడిగింది స్వప్న అతను మాట్లా డ్డమయ్యాక చెప్పాడు.

"ఈ రోజుల్లో లంగోటీలు కట్టుకుని యోగాస నాలు వేసేవాళ్లెవరు? అందులోనూ పిల్లలా? ఫ్రెండ్సు ముందు చిన్నతనమనుకుంటారు'' అంది స్వప్న. అతను ఎవరెవరికో ఫోన్లు చేశాడు. ఫ్రెండు సి.ఐ.కి కూడా చెప్పాడు. రాజా ఫోటో కావాలంటే అప్పటిక ప్పుడు పార్వతి దగ్గరకి వెళ్లి ఇచ్చి వచ్చాడు. శోకమూ ర్తిలా ఉన్న ఆమెని చూస్తుంటే బాధేసింది. ఆమెని వెంటబెట్టుకుని తమింటికి తీసుకొచ్చాడు.

ఎంత వెతికించినా పోలీసు కంప్లైంటిచ్చినా కూడా రాజా ఆచూకీ దొరకలేదు. ఏడ్చేడ్చి చిక్కి శల్యమైంది పార్వతి. వాడింక తిరిగి రాడని నిర్ధారించుకుంది. కొడు కుని కనీసం ఇంకొన్ని రోజులు... వాడికి వయసొచ్చి ఉద్యోగం దొరికే దాకానేనా హోల్డ్ చెయ్యగలనను కుంది.

కడుపునిండా తిండీ, కంటి నిండా నిద్రా ఉన్న ప్పుడే ఏ సంబంధాలేనా నిలిచేవి. శివరావ్ ప్రకృతి వైద్యాన్ని నమ్ముతాడు. పొద్దున్నే నాలుగింటికి లేచి యోగాసనాలు వేసి చన్నీళ్ల స్నానం చేసి, చప్పిడి తింటాడు. పచ్చికూరలూ, మొలకధాన్యాలూ తింటాడు. అందుకు పూర్తిగా భిన్నమైన వాతావరణం లోంచీ వచ్చిన పార్వతికి తన సిద్ధాంతాలని పరిచయం చేసి వాటి మీద నమ్మకం కలిగించే ప్రయత్నం చెయ్య లేదు. అలాగే అతను తన సిద్ధాంతాలని కొడుకుమీద రుద్దే పని చేశాడు. చుట్టూ ఉన్న ప్రపంచానికి వ్యతిరేక దిశలో వాడినీ ఇంటినీ నడిపించే ప్రయత్నం చేశాడు.

తెల్లటి లంగోటీ కట్టుకుని యోగాసనాలు వేసే భర్త మీద పార్వతికి శృంగారభావన కలుగలేదు. వెగట నిపించేది. అతను తినే తిండీ, దానివలన వచ్చిన పశు బలం ఆమెకి నచ్చలేదు. ఐనా ఊరుకుంది. కొడుకు ముందు బైటపడలేదు.

"కడుపెంత మాడినా వాడింక తిరిగి రాడు. ఇంత మొండిమనిషితో కలిసుం డటం ఇంక నా వల్ల కాదు. వాడికి నా వలన తండ్రి ప్రేమ ఎందుకు దూరమ వ్వాలని ఇంతకాలం ఓపిక పట్టాను. ఇంక మేం కలిసుండటంలో అర్థం లేదు'' అని పుట్టింటికి వెళ్లిపోయింది పార్వతి.

ఒక కుటుంబం నిష్కారణంగా విచ్ఛిన్నమవ్వటం కళ్లారా చూశాడు చంద్రమోహన్.

ప్రకృతి గురించీ, మనిషిలో ఉండే అంతర్గత శక్తి గురించీ ఆ రెండింటినీ సమన్వయపరిస్తే మనిషి సాధించగలిగే శక్తి గురించీ ఉపన్యాసాలిచ్చే శివరావ్ సొంత కుటుంబ విషయా లలో దారుణంగా ఓడిపోయాడు. ఆకులూ అల ములూ తింటూ ముక్కుమూసుకుని కాలం గడ పడం సన్యాసుల పని. అలాంటి దాన్ని సంసారిగా ఉంటూ ఆచరించాలని చూశాడు. విఫలమయ్యాడు. మనిషి ఉంటే ఒంటరిగా సంఘానికి దూరంగానే ఉండాలి. లేకుంటే సమాజంలో ఉంటూ దాని విలువ ల్నేనా పాటించాలి.

* * *

"ఎక్కడో లోపం జరిగిందనిపిస్తోంది రాజా విష యంలో'' బాధగా అన్నాడు చంద్రమోహన్ మాధవ్‌తో. అప్పుడు పోల్చాడు మాధవ్, పిల్లలని గినీపిగ్స్‌తో.

"క్రమశిక్షణ అవసరమే. కానీ అది మనిషిని కదల కుండా బంధించి ఉంచే ఫ్రేం కాకూడదు. ఆ ఫ్రేం అవతల కూడా జీవితం ఉంటుంది. అదీ అనుభవిం చదగ్గదే. భౌతికమైన క్రమశిక్షణ కన్నా నైతిక నిబద్ధత సమాజానికీ మనిషికీ చాలా మంచిది. నేను అబద్ధం చెప్పననుకోవటానికీ తెల్లషర్టే వేసుకుంటాను నల్ల పేంటే వేసుకుంటాననుకోవటానికీ చాలా తేడా ఉంది. అందుకే ఎన్నో చోట్ల యూనిఫాం ఉన్నా ఈ రోజుకీ మనకి సోషలిజం రాలేదు. పిల్లల్ని చూడు, స్కూలు నుంచీ రాగానే యూనిఫాం విడిచేసి మంచి మంచి బట్టల్లోకి మారిపోతారు. ఆ మంచి బట్టల్ని కొనిపెట్టగ లిగే తల్లిదండ్రుల సామర్థ్యత మీదే వాళ్ల భవిష్యత్తూ వాళ్లు నిర్మించబోయే సమాజం ఉంటాయి'' అన్నాడు తనే మళ్లీ.

"ప్రలోభాల మధ్య బ్రతుకుతూ మనసుని నియం త్రించుకోవటం చాలా కష్టం. దాదాపు అసాధ్యం. నిన్న ప్రలోభమైనది ఈ రోజుని అవసరం. రేపు అది లేనిదే బ్రతుకు లేదు. ఉదాహరణకి ఒకప్పుడు వంట గేస్. ఇప్పుడు కంప్యూటర్. అలాంటప్పుడు వేటిని నువ్వు ప్రలోభాలుగా నిర్వచించగలవు? అందుకే ప్రలోభాలకీ చెడ్డ అలవాట్లకీ మధ్య గిరిగీసి చెడ్డవాటి జోలికి వెళ్లక పోతే చాలనుకుంటాను. అలాగే సాధ్యాసాధ్యాల మధ్య కూడా. అదే మానసికమైన క్రమశిక్షణ. కొంత వయసు రాగానే అనేక విషయాల పట్ల మనకే విరక్తి కలుగు తుంది. శివరావ్ నాకు నచ్చలేదు. అతనితో మాట్లాడితే అసంతృప్తి కలుగుతుంది. మనం తప్పుగా బతుకుతు న్నామేమోననిపిస్తుంది. అందుకే అతన్ని కలవను ఎవా యిడ్ చేస్తాను'' అనేది అంతకు ముందు చెప్పినదా నికి కొనసాగింపు.

చంద్రమోహన్‌కి చాలా బాగా అర్థమైంది.

ఐస్‌ఫ్రూట్ బండి వాడి గంట విని ఏడ్చి కొనిపించు కున్నప్పటి బాల్యపురోజుల నుంచీ కమ్మగా రకరకాలు వండించుకుని అందమైన డైనింగ్ సెట్ సంపాదించు కుని అందులో తింటూ ఆనందాన్ని పొందే యౌవనం దాకా.


అక్కడి నుంచీ ఏదో ఇంత ఉడకేసుకుని తిని కాల క్షేపం చేసే వృద్ధాప్యం దాకా ప్రస్థావించడమే జీవిత మనీ, కాలమే మనిషికి పెద్ద ప్రలోభమనీ, వయసుతో పాటే ఆ ప్రలోభాల ఉత్థానపతనాలుంటాయనీ.

* * *

శివరావ్ ఒక ప్రకృతి వైద్యశాలలో ట్యూటర్‌గా చేరాడు. మనుషులు పచ్చికూరలూ, ఉప్పూకారం లేని వంటలు తినాలనీ శ్వాస లెక్కపెట్టుకుంటూ పీల్చి వదలాలనీ శృంగారం మగవాడికి ఆయుఃక్షీణ మని అతను రాసే వ్యాసాలు పుస్తకాల్లో వస్తుంటాయి. వాటిని చదివిన పాఠకులు వాటిని పాటించలేక బహుశః ఎంతో కోల్పోయామని బాధపడుతుండ వచ్చు.

"అతనూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నట్టే'' అన్నాడు మాధవ్ సరదాగా.

రాజా గుర్తొచ్చి చంద్రమోహన్ గుండె బరువె క్కింది. మౌనంగా ఉండిపోయాడు. మాధవ్ అర్థం చేసుకున్నాడు. ఇంటికన్నా సౌఖ్యమైన ప్రదేశం బైటె క్కడో ఉందని ఎవరికేనా అనిపించడం అత్యంత దుర దృష్టకరం'' అన్నాడు. అది శివరావ్‌ని గురించో రాజాని గురించో లేక ఇద్దరికీ అన్వయిస్తుందో చంద్రమోహన్ అర్థం చేసుకోలేకపోయాడు.




రాజా తిరిగి రాలేదు.

పార్వతి ఆత్మహత్య చేసుకుంది. శివరా వ్‌లో ఏ కదలిక వచ్చిందో తెలీదు, గడ్డాలూ మీసాలు పెంచేసి పూర్తిగా యోగాలో లీన మైపోయారు. రేపెప్పుడూ రాజా తిరిగొ చ్చినా అతనికి ఇల్లంటూ మిగల్లేదు.

ఇన్ని పరిణామాల తర్వాత చంద్రమో హన్ తనున్న ఫ్రేంలోంచీ బైటికి రావాలని స్ట్రగుల్ చేస్తున్నాడు.

మాధవ్‌లో ఏ మార్పూ లేదు. అతను ఒకప్పుడెలా ఉన్నాడో ఇప్పుడు అలాగే ఉన్నాడు.

☆